

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదురుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

# మే(మ)నత్త

' **పాపం, కావమ్మగారికేవీ బావులేదుట, ఒంట్లో..** ఆవిడ చివ్రరోజుల్లో పుట్టిన ఊరిలో, పుట్టినింట్లోనే ఉండాలని పట్టుపట్టారుట. అందుకే వారి పిల్లలు చిన్న కారులో రేపు సాయంత్రానికల్లా తీసుకొస్తారుట. పెద్దవయసు కదా, ఎలా ఉన్నారో, ఏమిటో? ' అనుకున్నారు ఊరంతా.. కామేశ్వరమ్మగారిని తీసుకొస్తున్నారు అన్న వార్త తెలియగానే.

' ఏమైనా కామేశ్వరమ్మగారు అదృష్టవంతులు, మా గొప్ప మనిషి. అలాంటివాళ్ళు అరుదుగా పుడతారు. ఆవిడ తరహాయే వేరు.. ఆవిడా, అన్నగారు ఒకరకం, తమ్ముడూ, చెల్లెలూ మరొక రకం' అనుకున్నారు వాళ్ళ కుటుంబం గురించి బాగా తెలిసినవారు.

కామేశ్వరమ్మగారినందరూ కావమ్మగారంటారు. చిన్నతనాన తండ్రి దగ్గరా, తర్వాత అన్నదమ్ముల దగ్గరా, పెద్దతనంలో అన్నదమ్ముల పిల్లల దగ్గరా జీవితాన్ని గడిపిన వెర్రి ఇల్లాలు ఆవిడ. అగ్రహారంలో 'వారి పిల్లలు' అని చెప్పుకునే వారు ఆవిడ సొంత పిల్లలు కారు.. ఆ-విడ అన్నగారి పిల్లలు.

అగ్రహారంలో జాబిల్లి పూసింది అనుకున్నారు ఆవిడ పుట్టిననాడు. బంగారు రంగులో,కళకళలాడే కళ్ళతో ఆ చిన్నారి తల్లిని చూసి వాళ్ళ నాన్నగారు 'మా అమ్మే తిరిగి వచ్చింది' అని ఆవిడ పేరే పెట్టుకున్నారుట. ఇంటికి పెద్దపిల్ల అని, ఆవిడ అందాన్ని, సుగుణాన్నీ చూసి వచ్చిన గొప్పింటి సంబంధం అని, ఎంతో ఆడంబరంగా చేసిన ఆవిడ పెళ్ళి మూణ్ణాళ్ళ ముచ్చట అయిపోయింది.

ఎలా వచ్చిందో ఆవిడకి ఎడంచేత్తో సంతకం చెయ్యడం మటుకు వచ్చింది, చదివినది పేరుకి రెండో తరగతైనా, అక్షరాలు మెల్లిమెల్లిగా కూడుకొని తెలుగు కొద్దిగా చదవడం మాత్రం వచ్చు. ఐతే ఎప్పుడూ 'కామేశ్వరమ్మ' అని కాక 'కామేశ్వరమ్మ వ్రాలు'అనే సంతకం చేసేవారు. ఎంతమంది ఎన్నిసార్లు చెప్పినా అది మాత్రం మారలేదు. ఎప్పుడూ ఒకేరకంగా అదే రాయడం వల్ల పెద్ద ఇబ్బంది రాలేదు.

తండ్రి తర్వాత అన్నయ్యంటే ఎంతో అభిమానం ఆవిడకి. ఏ విషయమైనా అతనికి చెప్తే కానీ ఆవిడకి తోచేది కాదు. తల్లీ, తండ్రీ పోయిననాటినించీ అన్నయ్యా, వదినా పిల్లలతోనే ఆవిడ జీవితం పెనవేసుకుపోయింది. లేనిదాన్ని గురించి బాధ పడడం ఆవిడకి తెలియదు, ఉన్నదాంట్లో తృప్తిగా, ఆనందంగా ఉండడం ఎలా అనేది మాత్రం తెలుసు. ఇప్పుడు కొత్తగా చెప్పే మాటలు 'పాజిటివ్ థింకింగ్' , చీర్‌ఫుల్‌నెస్ అన్నవాటికి నిర్వచనంలా ఉండేవారు. తనకి పిల్లలు లేకపోవడాన అన్నయ్య పిల్లలంటే ఎంతో అభిమానం ఆవిడకి.

"అత్తా.. జడ వెయ్యవా!" అంటూ వచ్చేది వాణి.

"ఇదిగో వస్తున్నా!. ఈ పచ్చడి రుబ్బేసి అమ్మకి ఇచ్చేసి వస్తాను".

అన్నయ్య కూతుళ్ళు వాణీ, సరస్వతీ, లలితా అందరివీ పెద్ద పెద్ద జుట్లు. ఆరుగురు పిల్లలతోనూ, వంటా వార్పులతోనూ వదినకి ఎప్పుడూ క్షణం తీరికే ఉండేది కాదు.. పైగా తరచుగా చేసే పూజలూ, పండగలూ, వచ్చేవాళ్ళూ, వెళ్ళేవాళ్ళూ ఇలా ఏదో ఒక పనితో సతమతమవుతూ ఉండే వదినని చూస్తే ఆవిడకెంతో జాలి. అందుకనే అన్ని పనులూ తనమీదే వేసుకుని చేసేవారావిడ. మరదలి తరహా మొదటినించీ వేరు, ఆవిడకి ఎక్కువగా మనుషులు పడరు, అంటీ ముట్టనట్టుండేది. మొదట కొన్నాళ్ళు ఇక్కడే ఉన్నా, తర్వాత ఉద్యోగ రీత్యా వేరే వెళ్ళిపోయారు వాళ్ళు.

వదిన ఏదైనా పనిమీద ఊరు వెళితే పిల్లల్లో బాగా చిన్నవాళ్ళని ఒకరిద్దరిని తీసుకుని వెళ్ళేది, మిగతావారంతా 'అత్తా ' అంటూ చుట్టూ చేరే వారు. అందరికీ వంట చేసి, అన్నాలు పెట్టి ఇంటి పని చేసి కూర్చునేసరికి నీరసం వచ్చేది..

అయినా సరే పిల్లలు 'అత్తా చింతగింజలాడదామా? గవ్వలాట ఆడదామా? ' అని పరిగెత్తుకుంటూ వస్తే కాదనకుండా ఆడేవారావిడ.

"అత్తా, రేపు అట్లతద్ది కదా! గోరింటాకు పెట్టుకోవద్దూ ?" అనే వాళ్ళతో సమానంగా చెట్లకొమ్మలు వంచి గోరింటాకు కోసి అందులో మంచి రంగు రావాలని చిళ్ళపెంకూ, కాకి బొడ్డూ వేసి మెత్తగా కాటుకలా రుబ్బి అందరికీ రెండు చేతులకీ పెట్టి తనూ పెట్టు వారావిడ. రాత్రి నిద్రలో వాళ్ళు చేతులు కలిపేసుకోకుండా మధ్య మధ్యలో లేచి పరీక్షలు చేసేవారు. సందడన్నా, సంబరమన్నా ఎంతో ఇష్టం ఆవిడకి. రోజూ సాయంత్రం పిల్లలందరికీ వేమన పద్యాలూ, సుమతీ శతకాలూ నేర్పేవారు.

అత్తవారి వైపునించి సంక్రమించిన పొలం సాగు వ్యవహారమూ, శిస్తులూ, పన్నులూ అన్నీ అన్నగారినే చూడమనే వారావిడ.

ఎప్పుడూ ఎవరినీ పల్లెత్తు మాట అనడమైనా ఆవిడకి తెలీదు. తెలిసో తెలియకో ఎవరైన ఏదైనా అన్నా 'చిన్నతనం ' అని నవ్వేసే అంత పెద్ద మనసుంది ఆవిడకి. అన్న పిల్లలే తన లోకంగా గడిపే వారావిడ. ఏ ఒక్కరికి జ్వరమో, జలుబో వస్తే తల్లడిల్లిపో వారావిడ. తగ్గేవరకూ వాళ్ళ పక్కనే కూర్చుని లాలించి, సేవలు చేసి ఎంతో గాభరా పడేవారావిడ.

అన్నయ్య కూతురు సరస్వతి పెళ్ళికి డబ్బు చాలకపోతే. తన మెడలోని నాలుగు వరసల పలకసర్లని తీసి ఇచ్చేసి " పగడాల తావళం వేసుకుంటే చాలదూ నాకూ!.. చిన్నపిల్ల, దాని ముందున్న జీవితం గురించి చూడు అన్నయ్యా, మంచి సంబంధాలు మళ్ళీ మళ్ళీ రావు కదా, అన్నీ కలిసొస్తే వచ్చే ఏడాదికి మళ్ళీ చేయించుకోవచ్చు. " అని శతవిధాల ఆలోచిస్తున్న అతనిని సమాధాన పరిచి మరీ ఒప్పించి - ఆ పెళ్ళిళ్ళని కళ్ళనిండా చూసుకుని సంతోషించారావిడ..

తన ఖర్చుకని ఎప్పుడైనా అన్నగారు ఇచ్చిన డబ్బులోంచే పిల్లలకి జీళ్ళూ, ఎండాకాలం మధ్యాహ్నంవేళ షోడాలు,చివరన ఉడికించిన సేమ్యానో, కొబ్బరికోరో అతికించిన పాల ఐస్‌ఫ్రూట్‌లూ కొనేవారు.

'కనలేదన్న పేరే కానీ కావమ్మగారి కన్నబిడ్డలే వాళ్ళు' అనుకునే వారు ఊరివారు. కమ్మటి భోజనం, కంటినిండా నిద్రా ఉంటే చాలు ఆవిడకి. కొత్తరకాల పచ్చళ్ళూ, అట్లూ వేసి పిల్లలందరికీ పెట్టి తనూ తినే వారు.

ఎప్పుడో అరుదుగా కోపమో, తెలియని బాధో వస్తే మౌనంగా పెరట్లో మందార చెట్టుకింద కూర్చుని మొగ్గలతోనూ, పువ్వులతోనూ మూగగా మనసులోని వేదన చెప్పుకోవడమే తప్ప ఇంట్లో గొడవ చెయ్యడమూ, వాటిని వీధిలో పెట్టుకోవడమూ తెలియదు ఆవిడకి.

అన్నయ్య పిల్లలందరూ పెరిగి పెద్దవాళ్ళయి స్థిరపడ్డారు. తమ్ముడూ, మరదలూ కాకినాడలో ఉంటారు ఎప్పటిలాగే.

ఇప్పుడు ఇంట్లో అన్నయ్య, వదినా ఆవిడా మాత్రమే ఉన్నారు. రెక్కలొచ్చిన పిల్లలు ఎగిరిపోతే చిన్నపోయిన గూడులా కనిపిస్తోంది అంత పెద్ద ఇల్లు. ఇంటిపనీ, వంటపనీ తప్ప ఎక్కువగా పిల్లలతో అనుబంధం లేని వదినకంటే కావమ్మగారికే పిల్లలమీద బెంగ ఎక్కువ. ఎప్పుడూ వాళ్ళనే పేరుపేరున తలుస్తూ, వాళ్ళచిన్న తనపు ముచ్చట్లు చెప్పుకుంటూ మురిసిపోయేవారు ఆవిడ. వాళ్ళు వస్తున్నారంటే పండగే ఆవిడకి.. వాళ్ళకి కావలసిన పిండివంటలన్నీ తనే స్వయంగా వండేది.. ముఖ్యంగా పెద్దమేనల్లుళ్ళు ఇద్దరికీ ఇష్టమని జిల్లేడు కాయలూ, జున్నూ వండి ప్రత్యేకంగా తేనె పానకం తెప్పించమని అన్నగారిని పోరేది.

ఎప్పటిలాగే ఆ సంవత్సరం కూడా అందరూ కార్తీకమాసపు సముద్ర స్నానానికి వెళ్ళారు. ఎప్పుడూ అలవాటుగా వెళ్ళే సముద్రమే పౌర్ణమి నాటి అలలతో పోతెత్తుతోంది, చూడడానికే భయంగా అనిపించింది. ఏదో ఉపద్రవాన్ని సూచిస్తున్నట్టుగా. స్నానం చేసి వస్తుంటే దారిలో బండిలోనే అనుకోకుండా గుండె పోటు వచ్చి అసలేం జరిగిందో తెలిసేలోపే అన్నయ్య కన్ను మూసాడు. జరిగింది అర్ధం అవడానికే ఆడవాళ్ళిద్దరికీ అరగంట పైన పట్టింది..

ఊరు తీసుకొచ్చి అందరికీ కబుర్లు పెట్టారు. అన్నీ అయ్యాకా తామిద్దరమూ ఇక్కడే ఉంటామన్నారు. కొన్నాళ్ళపాటు వదినగారూ, కావమ్మగారూ ఇక్కడే ఉన్నారు కానీ అన్నని వదిలి వదిన ఎక్కువ కాలం ఉండకుండానే ఆడపడుచు చేతిలో చెయ్యివేసి ఆవిడా వెళ్ళిపోయింది.

'ఇప్పుడు కావమ్మగారేం చేస్తారో? తమ్ముడిదగ్గరే ఉండాలేమో 'అనుకున్నారు ఊరిలో పెద్దవాళ్ళు. ఇంతలో అనుకోకుండా తమ్ముడికి అమెరికా వెళ్ళే అవకాశం రావడంతో ఆయన, కుటుంబంతో సహా వెళ్ళిపోయాడు.

అప్పుడే ఆవిడ మొదటిసారి తనగురించి ఆలోచనలో పడ్డారు. ఎంత చెల్లెలైనా అక్కడికి వెళ్ళి ఉండలేను కదా, ఎంత ప్రేమగా పెంచినా మేనల్లుళ్ళదగ్గరకీ, మేనకోడళ్ళదగ్గరకీ ఎలా వెళ్ళడం? అలా అని ఇంత పెద్ద ఇంటిలో ఒక్కర్తీ ఉండడమా? ఎలా అని పెద్ద సందేహం పట్టుకుంది ఆవిడకి.

అంతలో వచ్చారు అన్నయ్య పెద్ద కోడళ్ళిద్దరూ.. పార్వతీ, సుందరినూ..

"అత్తా, మేమందరమూ రేపో, ఎల్లుండో బయలుదేరదాం అనుకుంటున్నాం, పిల్లలకి స్కూళ్ళూ, మగవాళ్ళకి ఫీసులూ .. ఇబ్బంది కదా.. మీరు మా ఇద్దరి దగ్గరలో ఎవరి దగ్గరకి వస్తారో ఆలోచించుకుని చెప్పండి. దాని ప్రకారం బస్ టిక్కట్లు తెప్పించుకోవచ్చు. మీకు ఎవరి దగ్గర ఎన్నాళ్ళుండాలని అనిపిస్తే అన్నాళ్ళు ఉండవచ్చు, అచ్చు ఇక్కడున్నట్టే "అన్నారు ఇద్దరూ ముక్తకంఠంతో.

'ఎక్కువగా తెలియని భర్త పోయినప్పుడు రాలేదు, ఎంతో ప్రేమగా చూసుకున్న తల్లితండ్రులూ, అన్న, వదిన దూరమైనప్పుడు రాలేదు. గట్టిగా మాట్లాడితే ఇరవై ఏళ్ళుండని ఈ చిన్నపిల్లలిద్దరూ తన గురించి ఇంతగా ఆలోచించారు, ఎక్కడినించో వచ్చి తమ కుటుంబంలో కల్సినా సరే, తనని తమ మనిషిగా అనుకున్నారు అన్న భావనకే, ఆవిడకి భరించలేనంత ఆనందంతో అప్పుడు వచ్చింది దు:ఖం.

" అలాగేనమ్మా, అలాగే వెళదాం, మీరందరూ ఉండగా నాకేం తక్కువ ? " అని మాత్రం అనగలిగారు

అలా ఆవిడ తన మడి బట్టలూ, వత్తుల పెట్టే, పచ్చీసు బోర్డూ, పాత పప్పు గిన్నే, మధ్యలో బంగారపు పువ్వు పొదిగిన తన పెద్ద వెండి కంచం పట్టుకుని మొదటిసారిగా అగ్రహారం బయటకు అడుగు పెట్టారు.

అక్కడనించీ తనకి నచ్చినన్నాళ్ళు ఇద్దరి దగ్గరా ఉంటూ వచ్చారు. చెల్లెలింటికైనా, మిగతా పిల్లల ఇంటికైనా కేవలం చుట్టపుచూపుగానే. "నీ ఆస్థి గురించేమైనా చూసుకున్నావా? అని ఎవరైనా చుట్టాలో, తెలిసినవాళ్ళో అడిగితే చల్లగా పుచ్చపువ్వులా నవ్వేసి.. మా పిల్లలుండగా నాకెందుకమ్మా? ఆ వివరాలన్నీనూ.. వాళ్ళనడిగితే చెప్పరూ.. అయినా నేనడగను.. నాకక్కరలేదు.. "అనేది ఆవిడ.

" ఎంతైనా వాళ్ళు నీ అన్న పిల్లలు కదా! నీ కొడుకులు కాదు... మేనల్లుళ్ళు " అనేవారు వాళ్ళు.

"వాళ్ళు అల్లుళ్ళు అనుకున్నా, వాళ్ళ భార్యలు నాకు కూతుళ్ళు కారూ.. అలా చూసినా వాళ్ళందరూ నా పిల్లలే "అనేసేది ఆవిడ..

' ఇంత సంతృప్తి ఉన్న మనిషి కనకే ఈవిడ జీవితం ఇంత హాయిగా ఉంది' అనుకోవడం తప్ప ఇంకేమీ అనలేకపోయేవారు.

"చక్కగా పగడాల్లా ఎర్రగా కరకరా ఆలుగడ్డ వేపడం వేయించమ్మా సుందరి ".. అని చెప్పినా,

"బయటకెళుతున్నారా నువ్వూ, అబ్బాయినూ.. బావుందమ్మా పార్వతీ చీర , పచ్చరంగు నీ వంటికెంతో నప్పుతుంది, వచ్చేటప్పుడు రెండు ఆపిల్ పళ్ళో, ఆరింజిరీ (ఆరెంజ్‌లు) లో పట్రండి.. చాలా రోజులయింది" అనో ఇలాంటి చిన్న చిన్న కోరికలు ఆవిడవి..

"పిల్లల్ని కొట్టకండమ్మా.. మనక్కనక ఇచ్చాడు దేవుడు ఇంత బంగారాల్లాంటి పిల్లల్ని.. ఎంత కష్టపడి కంటే వస్తారు" అని పిల్లల మీద దెబ్బ పడనిచ్చేవారు కాదు.

"నువ్వూ వాడు సరదాగా వెళ్ళి రండి.. పిల్లలని నేను చూసుకుంటాను" అని దగ్గరుండి మరీ వాళ్ళని సినిమాలకీ, షికార్లకీ పంపేవారు.

"మనకేవిటమ్మా, మనం ఆఫీసర్లం.. మనకేం తక్కువమ్మా? ఉన్నన్నాళ్ళూ హాయిగా సంతోషంగా ఉండాలి అనేవారు.. "

ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా రోజువారీ కాలక్షేపం ఎలా చేసుకోవాలో ఆవిడకి తెలిసినంతగా ఎవరికీ తెలియదనే చెప్పాలి. స్నానం చేసి రోజూ తులశమ్మ కి " ఏవమ్మ లక్ష్మిదేవమ్మా? నిన్నేమని పూజిస్తునమ్మా? " అంటూ ఓ చెంబుడు నీళ్ళు పోసి, కాఫీ తాగి శుభ్రమైన బట్ట కట్టుకుని కుర్చీలో కూర్చుని.. 'ఉపవాసమ్ములు ఉండాలేనూ, జపమూ తపమూ చేయలేను.. తపమూ లాచారించాలేనూ. గోవిందా గోవిందా యనావే నారాయణ మూర్తిని అనో 'రామ భజన చేయరా, రాముడే దైవాము మనకు అనో దైవ నామ స్మరణ చేసుకుంటూ 'అత్తా భోజనానికి రండి' అన్న పిలుపు కోసం ఎదురు చూసేవారు.

" అబ్బాయి భోజనం అయ్యిందా, ఇంటి యజమాని భోజనం ఐతే కానీ తినకూడదమ్మా! " అనేవారు. తరవాత శుభ్రంగా భోజనం చేసి అక్షరాలు కూడబలుక్కుంటూ కాసేపు ఓ పేపరో, పుస్తకమో చదివి పదకొండు గంటలకల్లా నిద్ర పోయేవారు. నిద్ర లేచాకా.. " ఇవ్వాళ చపాతీలో, పకోడీలో వెయ్యమ్మా, వెధవ ఉప్పుడుపిండి బోరు.. " అనేవారు. మధ్యాహ్నం మూడు గంటలకి టిఫిన్ తినేస్తే రాత్రికి పండూ, మజ్జిగా. టిఫిన్ అయ్యాకా పక్క వీధి మాలక్షమమ్మగారో, ఎదురింటి వెంకాయమ్మగారో తోడు వస్తే గుడికి వెళ్ళి కాసేపుండి వచ్చేవారు. మేనల్లుళ్ళతో పాటు వారి భార్యలూ, పిల్లలూ కూడా అత్త అనే పిలిచేవారు. పిల్లలని ఆడించడమూ, వాళ్ళకి కథలూ, కబుర్లూ చెప్పడమూ ఆవిడకెంతో ఇష్టం

ఆవిడ ఢభై ఐదవ పుట్టినరోజు చక్కగా చేసారు పిల్లలు. ఎప్పటినించో ఆవిడ అడిగిన సేలం పట్టుపంచెతెచ్చారు. రోజూ భోజనం చేసే వెండికంచానికి తోడు 'మంచినీళ్ళకి' అని పెద్ద వెండి గ్లాస్ కొన్నారు. బూరెలూ, పులిహోరా, రెండు కూరలూ, పప్పూ, పులుసూ

బజ్జీలూ, ఆవడలూ వగైరాలు వేసి ఆవిడకి తోడుగా గుడికి వెళ్ళే స్నేహితులనీ,అగ్రహారంలోని కొందరు పెద్దలనీ, చుట్టుపక్కల నాలుగిళ్ళవాళ్ళనీ పిలిచి భోజనాలు పెట్టారు. ఆ రోజంతా ఆవిడనెంతో సంతోషంగా ఉంచారు.

"దేవుడు కొన్ని తీసుకుపోయినా కొన్నిస్తాడేమో.. నాకన్నీ సవ్యంగా జరిగినా మీ అంత మంచి పిల్లల్లుండేవారా? మీ రంతా ఉండగా నాకేం లోట్రా? ఈ క్షణాన 'ఇలా రా కామేశ్వరమ్మా' అని పైవాడు పిలిస్తే, ఎగిరి గంతేసి వెళ్ళిపోనూ" అన్నారావిడ గద్గద స్వరంతో..

"తప్పు అత్తా.. అలాంటి మాటలనకండి.. మీకేవిటి? మీరు నిండా నూరేళ్ళు ఉంటారు.. మీమనవల పెళ్ళిళ్ళు చూడరూ.. అని అనునయంగా మాట్లాడారు.

ఎప్పటిలాగే "రేడియో నా కిటికీలో పెట్టమ్మా, హరికథ వస్తుంది ఇవ్వాళ" అన్నారు. ఆవిడ రాత్రి నిద్రకాగలేరు.. హరికథ రాత్రి ఎనిమిదిన్నరకో, తొమ్మిదింటికో మొదలయ్యి ఓ గంటా, గంటన్నర సేపు సాగుతుంది. ఆవిడ ఎప్పుడూ విధిగా మధ్యలోనే నిద్రపోతారు. అయినా ప్రతీవారమూ హరికథ వింటాననీ, తన మంచం పక్కన గూట్లో రేడియో పెట్టమనీ అడుగుతారు..

అది బాగా తెలిసిన కోడళ్ళు ఆవిడని సరదాగా ఆట పట్టించడానికి మర్నాడు పొద్దున్నే "అత్తా. రాత్రి హరికథ ఎలా ఉంది? ఏమైందో చెప్పండి!" అంటే..

" బావుందమ్మా, ఎంత బాగా చెప్పాడో శాస్త్రిగారు.. సీతాపహరణంట.. జటాయువు సీతనెత్తుకుపోతుంటేనూ.. "అని ఎదో చెప్పబోతే..

"జటాయువా, రావణుడా? అత్తా.. " అని అడుగుతారు వాళ్ళు వస్తున్న నవ్వునాపుకుంటూ

"అదే. జటాయువన్నానా?.. రావణాసురుడు ఎత్తుకుపోతుంటే జటాయువు అడ్డొచ్చాడు అనబోయి.. అని నవ్వేసేవారు. అసలు విషయమేమిటంటే తను నిద్రపోలేదనీ, కథ పూర్తిగా విన్నానని చెప్పడానికే ఆవిడకి గుర్తున్నంత కొంతా, సొంత కవిత్వం జోడించి కొంతా అలా ఎదో ఒకటి చెప్పేసేవారు. దానివల్లే అప్పుడప్పుడు రామాయణంలోని పాత్రలు భారతంలోకి, భారతంలోని పాత్రలు భాగవతంలోకీ కూడా ప్రవేశిస్తూ ఉండేవి.

ఆరోజు కూడా అలాగే ఆవిడ నిద్ర పోయిఉంటారు కదా అని చూడటానికి వచ్చిన పార్వతికి మంచం మీద గుండెనొప్పితో బాధపడుతున్న ఆవిడని చూసేసరికి కంగారు వేసి అందరినీ లేపేసింది.. వెంటనే డాక్టర్ని పిలిచారు.

ఆయన పరీక్షచేసి.. " బాగా ఎక్కువగా వచ్చింది అనుకోకుండా , చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇంకెన్నాళ్ళో చెప్పలేం, పెద్దవయసు కదా! " అన్నారు. ఆమాట ఆవిడ వినవే విన్నారు.

అప్పటినించీ "ఒరే నాయనా ఒకసారి మన ఊరు వెళదామ్రా, నాకెందుకో మా అన్నయ్య, వదినల్లాగే అక్కడే నా చివరి రోజుల్లో ఉండాలని ఉంది" అని గొడవ పెట్టడం మొదలు పెట్టారు. దానికి తగ్గట్టు ఆవిడ ఆరోగ్యం క్షీణించసాగింది, అందుకనే అందరూ కలిసి - ఆవిడని సొంత ఊరు తీసుకుని వచ్చారు.

"కావమ్మగారి రోగ్యం బొత్తిగా బావులేదుట, ఇక్కడికే తీసుకొస్తున్నారుట అని ఊరివాళ్ళు అందుకే అనుకున్నారు.

నెమ్మదిగా పసిపాపని దింపుతున్నట్టుగా ఆవిడని మేనల్లుళ్ళూ, వారి భార్యలూ, పిల్లలూ కారులోంచి దింపడాన్ని ఊరివాళ్ళు ఎంతో ఆరాధనగా చూసారు. ఆవిడని చక్రాల కుర్చీలో కూర్చోబెట్టి నిదానంగా లోపలకి తీసుకొచ్చారు. ఆవిడ కోరిక ప్రకారం ఇల్లంతా తిప్పి చూపించారు. తులశమ్మలో నీళ్ళు పోస్తానంటే దగ్గరుండి పోయించారు. మందారచెట్టుకింద కూర్చోబెట్టి కొబ్బరిబొండం తాగించారు. ఊరివారందరూ వచ్చి చూసి పలకరించి వెళ్ళారు.

"జావ తాగమంటే నాకు చిరాకమ్మా, అయినా ఇన్ని కొత్త రకాల టిఫినులు ఉంటే జావ ఏమిటీ చిరాగ్గానూ" అనే ఆవిడ ఆరోజు "ఆకలి లేదమ్మా, కొంచం గోధుమ జావ తాగుతాను" అని అడిగి మరీ తాగారు. పనిమనిషి రుబ్బి ఇస్తే గోరింటాకు పెట్టించుకున్నారు. తనని చూడటానికి వచ్చిన కరణంగారితో రెండు నిమిషాలు మాట్లాడారు. తను ఎప్పుడూ చేతికి పెట్టుకునే రెండు ఉంగరాలూ మేనల్లుళ్ళిద్దరికీ రాత్రే ఇచ్చేసారు.

తన గదిలో పాత పందిరిపట్టెమంచమ్మీద పడుకుని కిటికీలోంచి తన మీద పడుతున్న వెన్నెలను చూస్తూ మెల్లిగా కళ్ళు మూసుకున్నారు. మూసిన ఆ కన్ను మరి తెరవలేదు. ముఖంలో అదే చెరగని చిరునవ్వు. 'లేదనుకుంటే మనం చూసేది వెలితినే.. ఉందనుకుంటేనే జీవితంలో నిండుతనం కనిపిస్తుంది ఈ విషయం తెలుసుకుంటే మనిషికి చింతేముంది? తెలుసుకోకపోతే మన మనుగడకి అర్థమేముంది? 'అన్నట్టుగా ఉందా చిరునవ్వు.

ఆ సంగతి తెలియగానే అందరూ వచ్చారు. ఆవిడ మేనల్లుళ్ళనీ, పార్వతీ, సుందర్లని ఓదార్చడమే కష్టంగా ఉంది.
వారిదగ్గరకి అప్పుడు వచ్చారు కరణంగారు చేతిలో సంచీతో. "మీ ఇద్దరితోనూ రెండు ముక్కలు చెప్పాలయ్యా, కావమ్మగారు నా మీద పెట్టిన బాధ్యత ఇది. ఇవిగోనండి.. దస్తావేజులు. ఆవిడ పేరునున్న పొలమూ, దానిమీద వచ్చే శిస్తు ని మీరు ప్రతీ నెలా బాంకులో వేయగా వచ్చిన డబ్బూ, తన తదనంతరం మీకే చెందేటట్టుగా వారు రాసిన విల్లు. ఆవిడకి మిగిలిన బంగారం మీ ఇద్దరి భార్యలకీనూ.. అని ఒక్క క్షణం ఊపిరి తీసుకోవడానికి ఆగారు.

ఇదంతా ఎప్పుడు జరిగింది? అన్నట్టుగా ఆశ్చర్యంగా చూసారు అన్నదమ్ములిద్దరూ.. ఆయన మళ్ళీ మాట్లాడుతూ "మీకు చెప్పద్దన్నారు.. మొన్న పుట్టినరోజుకి నన్నూ రమ్మన్నారు కదా, అప్పుడే మీకు తెలియకుండా చెయ్యమన్నారు ఈ పని. తెలిస్తే ఇప్పుడు ఈ మాటలన్నీ ఎందుకు? మాకొద్దు అంటారని అన్నారు.. అంతేకాదు..

ఇంకా ఇలా అన్నారు. "కరణంగారు.. దేవుడు అందరికీ అన్నీ ఇవ్వడు. ఎందుకంటే అన్నీ ఇచ్చేస్తే ఇంక ఆయనకేసి ఎవరు చూస్తారు? అన్న భయమో, లేక ఎవరికెప్పుడు ఎంత ఇవ్వాలో నాకు బాగా తెలుసు అన్న విశ్వాసమో. అదీ ఆయనకే తెలియాలి కానీ మనకి తెలియదు. మనకిచ్చినవే ఆయనకి నచ్చినవి అనుకుంటే బాధ ఉండదు కదండీ.. లేకపోతే అమ్మా నాన్నా బ్రతికి ఉండగానే ఆస్తి పంచమనీ, అనాధాశ్రమం అనాధాశ్రమంలో ఉండమని అనే పిల్లలున్న ఈ రోజుల్లో మా పిల్లల లాంటి పిల్లలుండడమేమిటి చెప్పండి? చూసి చూసి చూరు నీళ్ళల్లాంటి కాఫీ ఇస్తుందిట వెంకాయమ్మగారి కోడలు. మాలక్ష్మమ్మగారిభర్త ఫించను ఒకటో తారీకునే తీసేసుకుంటాడుట కొడుకు. నీకు మేమేం చేస్తున్నాం అత్తా? రెండు పూటలా భోజనం తప్ప, ఇదీ ఓ గొప్ప పనేనా అంటారు మా పిల్లలు, అది వాళ్ళ మంచితనం.

వాళ్ళ సంసారాలూ, ఖర్చులూ ఎలా పెట్టుకుంటారో ఏమో, నా డబ్బు ఇప్పటివరకూ ఒక్క పైసా ముట్టుకోలేదు. వాళ్ళ పిల్లల చదువులకీ, పెళ్ళిళ్ళకీ నా భూమీ, డబ్బూ ఉపయోగపడితే అంతకన్నా నాకు కావలసినదేముంది చెప్పండి. వాళ్ళకి ఇలా విల్లు రాస్తున్నానని చెప్తే అస్సలు ఒప్పుకోరు. ఇప్పటినించి ఎందుకత్తా ? తరవాత చూద్దాం అనో ఏదో ఒకటి అంటూ అని నాకేదో అడ్డు చెప్తారు. నిండు నూరేళ్ళు మీరిలాగే మాతోనే ఉంటారు, అంటారు, వీళ్ళ అభిమానం చూస్తే నాకూ అలాగే ఉండిపోవాలని అనిపిస్తుంది కూడా, అయినా మనం వచ్చిన పని మర్చిపోకూడదు కదా, పెద్దవారు మళ్ళీ మిమ్మల్ని ఈ పనికోసం రమ్మని ఇబ్బంది పెట్టడం నాకు భావ్యం కాదు, కనక ఈ చిన్న పని చేసి పెట్టి వెళ్ళిపోండి. అది మా వాళ్ళకి ఇవ్వాల్సిన రోజున మాత్రం ఇచ్చేయండి. మా అన్నయ్య తర్వాత మన ఊరిలోనే నాకంతటివారు మీరు. అందుకే ఈ పెద్దపనిని మీకప్పచెప్తున్నాను" అన్నారు బాబూ.. కంటి చూపుని అస్పష్టం చేస్తూ ఆయన కళ్ళల్లో సన్నని నీటి తెర.

ఆయన చేతిలో రెపరెపలాడుతున్న కాగితాలు. "కామేశ్వరమ్మ వ్రాలు" ఎప్పటిలాగే ఎడం చేత్తో ఎగుడుదిగుడుగా రాసిన సంతకంలోని ఒక్కో అక్షరమూ వారికేసే కొండంత ప్రేమతోనూ, వాత్సల్యంతోనూ చూస్తున్నాయి. అంత బాధలోనూ కామేశ్వరమ్మ అన్న పదం చూసి చిరునవ్వు వచ్చింది వాళ్ళ పెదవులమీదకి. తమకి ఎంతో పరిచయమైన  అక్షరాలు అలుముకుపోయినట్టుగా కనబడటానికి కారణం పెద్దతనంవల్ల వణికిన ఆవిడ చెయ్యి కాదు.. చిన్ననాటినించీ తమతోనే పెనవేసుకుపోయిన ఆ మ(మే)నత్త అభిమానానికి అప్రయత్నంగా తిరిగిన కన్నీరే..

Click here to share your comments on this article